# పరిష్కారం

కలవకుంట్ల గురునాథపిళ్ళై

వాన కురిసి వెలిసింది. ఆకాశంలో తెల్లటి మేఘాలు గుంపులు గుంపులుగా- వరుసలు కట్టి పరుగులు తీస్తున్నాయి. బజారు వీధంతా చిత్తడి నేలలా మారింది. అక్కడక్కడా నీరు ప్రవహిస్తున్నది. గొడుగులు పట్టుకొని హడావిడిగా పరుగులు తీస్తున్న జనసంద్రాన్ని చూస్తుంటే ఎందుకీ హడావిడి అనిపిస్తుంది. అయినా మనిషి బ్రతికినన్నాళ్ళూ ఈతాపత్రయం తప్పదేమో! చలిగాలి వీస్తూవుంది. స్వెట్టరు ధరించినా చలి వణికిస్తూవుంది.

అద్దెగది కిటికీ నుండి దృశ్యాలను కనుచూపుమేరా చూస్తున్నాను. ఒకదానిపై ఒకటి పోటీపడి కట్టారేమో అన్నట్లున్న రంగురంగుల మేడలు, వాహనాల రణగొణధ్వనులు, వాటి నుండి వెలువడే కాలుష్యం కోరలలో విలవిలవాడిపోతున్న జనులు. కనువిందుగా, తమాషాగా, దయనీయంగా వుంది. ఈ జనాభా విస్ఫోటనం ఇలాగే వుంటే ఫలితాలెలావుంటాయి? చివరకు త్రాగునీరైనా అందరికీ అందుబాటులో వుంటుందా? అనే వూహ భయాన్ని కలిగిస్తూవుంది. ఇలా అంతూ పొంతూలేని ఆలోచనలు. దేనినుండి అయినా తప్పించుకోవచ్చుగానీ మనిషిని వెంటాడి వేదించే ఆలోచనల నుండి తప్పించుకోవడం చాలాకష్టం.

నేను పట్నంలో మెడిసిను చదువుతున్నాను. ఈ సంవత్సరం గడిస్తేచాలు, యం.బి.బి.యస్. పట్టా చేతికి వచ్చినట్లే. నా శ్రమా ఫలిస్తుంది. నాపై ఆశలు నిలుపుకొన్న అమ్మా, నాన్నల కలలూ ఫలిస్తాయి. ఎప్పుడు డబ్బులు కావాలన్నా ఎందుకని ఆరాతీయకుండా, ఎంతడిగితే అంతాయిచ్చే నాన్న ఇప్పుడెందుకు ఇవ్వడంలేదు? తానే స్వయంగా వచ్చి ఇచ్చేవారు. డి.డి. అయినా పంపేవారు.

మా బస్తీలో మేమే మోతుబరి రైతులం. పెద్దలు ఇచ్చిన ఆస్తిని మరింత చేశాడు మా తాతయ్య. తెలిసిన వారందరూ చేతికి ఎముకలేని మనిషి అనేవారు. ఆయన చేసిన దానధర్మాలకు హద్దేలేదు. మా బస్తీలో ఆయన మాటకు ఎదురేలేదు. ఆయన హయాం అలా జరిగింది. ఆయన పోయిన తరువాత తెలిసింది, నాన్నకు తాతయ్య చేసిన అప్పుల గురించి. అవి తీర్చేసరికి మాకు మిగిలింది రెండుమేడలు, పదెకరాల పొలం. ఇదంతా నాన్న అప్పుడప్పుడు యింట్లో చెప్పేవారు. అయినా మాకేం తక్కువ? ఇంటి బాడుగలు, ఫలసాయం, నాన్న జీతం దర్జాగా బ్రతకడానికి యివి- చాలవా? అనుకొనేవాడిని. ఉన్నదానితో సంతృప్తిపడి జీవించే జీవితమే జీవితం.

మా బస్తీయే మండల ముఖ్యకేంద్రం. మండల పరిషత్తు ఆఫీసులో మానాన్న అనంతయ్యగారు యం.ఇ.ఓ.గా వున్నారు. మా జనని సుందరమ్మగారు. నాకు ఇద్దరు అక్కయ్యలు. పెద్దక్కయ్య శ్యామల. అత్తారింటివారు శ్రీమంతులు. ఆమె భర్త శ్యాంసుందర్. ఉన్న వూళ్ళోనే బ్యాంకు వుద్యోగి. అటువంటి భర్త దొరకడం అక్కయ్య పూర్వజన్మ సుకృతమంటారు యిరుగుపొరుగు. వారికిద్దరు ముత్యాలవంటి బిడ్డలు.

చిన్నక్కయ్య మీనాక్షి కనుల సోయగం చూచి ఆ పేరు పెట్టారట. ఆమె అందం చూచి, రాంబాబు పట్టుపట్టి పెళ్ళి చేసుకొన్నాడు. బాగా బ్రతికి చెడ్డకుటుంబం. ఎం.ఏ.బి.యిడి చదివాడు. తెలివైనవాడు. ఉద్యోగం రాకపోతుందా? అనే ధైర్యంతోనే పెళ్ళి జరిపించారు. రెండుసార్లు డి.యస్.సి.లో టీచరుగా సెలెక్టు కాలేకపోయాడు. మాకందరికీ ఇదో మనోవ్యధ. స్వంత యిల్లుంది. ఏదో ఫ్యాక్టరీలో చిరుద్యోగి. చిన్నక్కయ్య యింటి ఖర్చులకని ప్రతినెలా అంతో యింతో తీసుకువెళుతుంది.

ఒకే చెల్లెలు శ్రీదేవి. ప్రస్తుతం యింటరు సెకండియరు చదువుతున్నది. మంచి తెలివైనది. కుదిరితే పెళ్ళి చెయ్యాలని అమ్మా, నాన్నల వుద్దేశ్యం.

ఇద్దరు అక్కల తరువాత నేను పుట్టాను. లేకలేక కలిగిన మగ సంతానమని అల్లారుముద్దుగా పెంచారు. నేనాడింది ఆట. పాటింది పాట. నేనేది కావాలన్నా క్షణాల్లో నాముంగిట వాలాల్సిందే. డబ్బుకు ఇబ్బంది పడడం అంటే ఏమిటో నాకు తెలియదు. ప్రస్తుతం డబ్బుకు కటకటగా వుంది. ఈ సమాజంలో డబ్బు లేనిదే క్షణం గడవదుగదా! నాన్న పంపుతాడనే ధీమాతో స్నేహితులవద్ద చేబదుళ్ళు తీసుకొన్నాను. వాళ్ళు డబ్బులు కావాలని తొందర చేస్తున్నారు. దిక్కు తోచడంలేదు. అక్కడికీ నాన్నకు డబ్బు వెంటనే పంపమని రెండుసార్లు ఫోన్ చేశాను. డబ్బు పంపుతానన్నారేగానీ, ఇంతవరకు అతీగతీ లేదు. డబ్బు పంపకపోవడానికి కారణమేమిటి? రకరకాల ఆలోచనలతో తలనొప్పి వచ్చింది. గది బయట చీకట్లు ముసురుకొంటున్నాయి. తిరిగి వానజల్లు కురవడం మొదలైంది. షర్టు, ప్యాంటు తొడిగాను. ఈసారి మళ్ళీ ఫోన్ చేద్దామని గొడుగందుకొన్నాను.

మా యింటికెదురుగానే యస్.టి.డి. బూతుంది. వెళ్ళి ఫోన్ చేశాను. నాన్న ముభావంగా మాట్లాడారు. ఇంటికి వస్తే డబ్బిస్తానన్నారు. వెంటనే బయలుదేరి రమ్మన్నారు.

మా బస్తీకి ఇక్కడినుండి గంట ప్రయాణం. హైవేరోడ్డుకు ఆనుకొనేవుంది. ఈ వర్షంలో ప్రయాణం చిరాకనిపించినా తప్పదుగనుక బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి ఇల్లొక రణరంగంగా వుంది. నాన్నెందుకో కోపంతో రంకెలేస్తున్నారు. చిన్నక్కయ్య విషాదం మూర్తీభవించిన శోకదేవతలా వుంది. వెక్కి వెక్కి ఏడుస్తూనే నాన్నకేదో బదులిస్తున్నది. అమ్మ ఇద్దరికీ ఏదో సర్దిచెబుతున్నది. నన్ను చూడగానే వాతావరణం మారిపోయింది. ధుమధుమలాడుతూనే నాన్న గబగబా తన గదిలోకి వెళ్ళిపోయారు. నేను చూడగూడదనేమో, అక్క పైట చెంగుతో కళ్ళు తుడుచుకొంది. సందర్భమేమిటో నాకు అర్థంకాలేదు. అమ్మ నన్ను చూడగానే గబగబా ఎదురొచ్చి ''ఏరా, రాజేంద్రా! యిప్పుడేనా రావటం,'' అంది.

తలూపాను. ఏమి మాట్లాడాలో అర్థంకాని పరిస్థితి.

నాన్నంటే నాకిప్పటికీ భయమే. ఆయన మూర్తిమత్వమంతటిది. అమ్మవద్దే చనువెక్కువ. రాత్రి భోజనాల సమయంలో విషయమేమిటని అమ్మనడిగాను.

చిన్నక్కయ్య వచ్చి వారమైంది. ఈసారి కూడా బావ డి.యస్.సి.లో ఎంపిక కాలేదు. ఏదో ప్రైవేటు కంపెనీలో వుద్యోగం చేసేవాడు. ఆ కంపెనీ దివాళా తీసింది. బావకు ఉద్యోగం పోయింది. ఎక్కడెక్కడో వుద్యోగం కోసం ప్రయత్నించాడు. ఎక్కడా వుద్యోగం దొరకలేదు. ఎవరో కోళ్ళఫారంలో బాగా లాభాలొస్తాయని, లీజుకిస్తాం తీసుకోమన్నారు. పెట్టుబడిగా యాభైవేల రూపాయలవసరం. మీనాక్షక్క డబ్బుకోసమే వచ్చింది. నాన్న తన వద్దలేదంటున్నాడు. ఇదీ అమ్మ చెప్పిన విశేషాల సారాంశం.

మొదటిసారిగా నాన్నవద్ద డబ్బులు లేవనే విషయం విని ఆశ్చర్యపోయాను. ఇవ్వాలంటే నాన్నకో లెఖ్ఖా? అక్కకు డబ్బివ్వడం నాన్నకిష్టంలేదేమో? అందుకే లేదంటున్నాడేమో? ఇలా పరిపరి విధాల ఆలోచనలు నాలో మెదలాడాయి.

నాన్న తన గదిలోనుండే ''రాజేంద్రా! ఇలారా,''

అన్నారు. వెంటనే వెళ్ళాను.

''కూర్చో. నీతో కొన్ని విషయాలు చెప్పాలి.''

కాస్త ఎడంగా కూర్చున్నాను.

''రాజేంద్రా! నీవూ ప్రాజ్ఞుడవయ్యావు. కొన్ని కుటుంబ విషయాలు నీతో చెప్పాల్సిన తరుణం వచ్చింది. ఇంతవరకు మీ చదువులకు, మీ అక్కల పెళ్ళిళ్ళకు వున్న ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోయాయి. ప్రావిడెంటు ఫండు, ఎల్.ఐ.సి. లాంటి వాటిలో దొరికినన్ని అప్పులు చేశాను. మనకున్న రెండు మేడలలో ఒకదాన్ని అమ్మేశాను. ఇప్పుడు మనమున్న యిల్లు కూడా దశరథరామయ్యగారికి కుదువ వుంచాను. ఇంకా దొరికిన చోటనల్లా అప్పులు చేశాను. వచ్చే జీతంరాళ్ళు యింటి ఖర్చులకు, చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే బొటాబొటిగా సరిపోతున్నది. చేసిన అప్పులు తీర్చడమెలా? నీ చదువెలా సాగుతుంది? శ్రీదేవికి సంబంధాలు వస్తున్నాయి. ఆమె పెళ్ళెలా చేయాలి? పులిమీద పుట్రలా మీ చిన్నక్కయ్య ప్రతినెలా వస్తుంది. డబ్బులు కావాలంటూ వేదిస్తుంది. ఇప్పుడు యాభైవేలు కావాలంటున్నది. ఇంతవరకూ నీవడిగినంతా ఇచ్చాను. ఇంటి పరిస్థితులు తెలిస్తే నీవెక్కడ బాధపడతావోనని ఈ విషయాలన్నీ నీకు తెలీకుండా మేనేజ్ చేశాను. ఇప్పుడు పరిస్థితులు జటిలంగా వున్నాయి. ఎక్కడా డబ్బు పుట్టడంలేదు.

దశరథరామయ్యగారిని మరో లక్ష కావాలని అడిగాను. మీ రాజేంద్రను పిలుచుకురా, అతని సమక్షంలో ఇస్తానంటున్నాడు. ఈ మెలిక ఏమిటో నాకర్థంకావడంలేదు. నిన్ను పిలుచుకువెళ్ళడం నాకిష్టంలేదు. అయినా ఏం చేయగలను? అందుకే నిన్ను రమ్మన్నాను. రేపు వెళ్ళి లక్షా తెద్దాం. మీ అక్కకు యాభైవేలిద్దాం. మిగిలిన యాభైవేలు నీవు తీసుకెళ్ళు. ఈ సంవత్సరం ఎలాగో సర్దుకో. అప్పు తెస్తున్న డబ్బులు, జాగ్రత్తగా వాడుకో. అంతకూ చాలకుంటే తరువాత సర్దుతాను. రేపుదయం దశరథ రామయ్యగారిని వెళ్ళి కలుద్దాం. స్నానం చేసి రెడీగా వుండు. చాలా ప్రొద్దైనట్లుంది. ఇక వెళ్ళిపడుకో'' అన్నాడు నాన్న.

అప్పుచేసి పప్పుకూడంటే ఏమిటో నాకిప్పుడిప్పుడే తెలుస్తున్నది. పోనీ అక్కయ్య కుటుంబ పరిస్థితులు బాగుపడితే మాకంతేచాలు. నా చదువూ పూర్తవుతుందని మనసులో అనుకొన్నాను. వెళ్ళి నా గదిలో పడుకొన్నాను. నిదురరావటంలేదు. నాన్న యింతటి కష్టదశలో వున్నాడనే బాధ నను వేదిస్తున్నది. సంఘంలో ఎందరో తండ్రులు తమ కులాసాలకు, విలాసాలకు ప్రాధాన్యతనిస్తూ, బిడ్డలను అలక్ష్యం చేస్తుంటారు. నిరంతరం మా భవిష్యత్తుకోసం పరితపించే మానాన్నలాంటి వారెందరున్నారు? ఇలా ఎన్నో ఆలోచనలతో ఎప్పుడు నిద్రపోయానో ఏమో!

మొదటిసారిగా దశరథ రామయ్యగారింటికి నాన్నతోబాటు వెళ్ళాను. పెద్ద బంగళా. చుట్టూ తోట. పోర్టికోలో రెండుకార్లు. చూడగానే గొప్ప ఐశ్వర్యవంతులనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. ఆయన నాకు చిరపరిచితులే. ఎప్పుడు కనిపించినా నా యోగక్షేమాలు విచారించేవారు. నా చదువుగురించి ఆరాతీసేవారు.

దశరథరామయ్యగారు మమ్మల్ని ఆప్యాయంగా పలుకరించారు. సాదరంగా ఆహ్వానించారు. వద్దువద్దంటున్నా టిఫిన్ ఏర్పాటు చేశారు. ఎవరు చేశారోగానీ టిఫిన్ చాలా రుచిగా వుంది. ఆయన ఏకైక కుమార్తె స్వయంగా కొసరి కొసరి వడ్డించింది. సుష్మను యిదివరకే చాలాసార్లు చూశానుగానీ ఫలానా అని తెలీదు. అతి దగ్గరగా చూడడం ఇదే మొదటిసారి.

సుష్మ మెరపుతీగలా, సన్నగా, నాజూగ్గా వుంది. మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీలకు వెళ్ళగలిగినంతటి అందమామెది. మెళ్ళో ఒక సన్నపాటి గొలుసు, చెవులకు రింగులు తప్ప మరే నగలూ లేవు. ఎంతో నిరాడంబరంగా వుంది. ఆమె మాటలు, వెన్నెల సోనలా జాలువారినట్లుంది. చేసుకోబోయే వాడెవడోగాని ఎంతో అదృష్టవంతుడనిపించింది. సుష్మ మాతో మాట్లాడేంతసేపూ నన్నే నిశితంగా గమనిస్తున్నట్లనిపించింది. ఆమె యింటిలోనికి వెళుతూ, వెళుతూ నావైపు చూచిన చూపులు మరుని తూపుల్లా వున్నాయి. ఆ చూపుల్లో నాకు తెలియని సందేశమేదోవుంది. ఏమైవుంటుంది?

నాన్న డబ్బు విషయం కదిపారు. ఇంట్లో పులిలా కనిపించే నాన్నగారు డబ్బడిగిన తీరు నన్నెంతో కదిలించింది. అయినా ఏం చేయగలను? కన్నబిడ్డలకోసం నాన్న చేజాచి అడిగిన సన్నివేశం నామనస్సును కదిలించింది. కళ్ళల్లో నీరు సుడులు తిరుగుతున్నట్లుండి బలవంతంగా కంట్రోలు చేసుకోగలిగాను.





## అదృష్టం

అప్పుడే ఆ పల్లెటూరులో మొదటి సారి కరెంటు ఇచ్చారు. ''ఇంతకాలం తమకే గొప్పగా దొరుకుతోందని పట్నంవాళ్ళు తెగ మిడిసిపడుతున్నారు. ఆ అదృష్టం మనల్ని కూడా వరించబోతోందని వాళ్ళకేం తెలుసు!'' అన్నాడు భర్త.

''ఏమిటండీ అది?'' అని భార్య అమాయకంగా అడిగింది.

దానికతను ఇచ్చిన జవాబు- ''కరెంటుకోత!''

## పునర్జన్మ

''నీకు పునర్జన్మమీద నమ్మకముందా?'' అని మేనేజరు ఎందుకడిగాడో అర్థంకాక ''ఎస్సార్!'' అన్నాడు క్లర్కు కాంబాబు బిడియంగా.

''మీ మామయ్య చచ్చిపోయారని ఆయన శ్రాద్ధ కర్మలకి వెళ్ళాలని శలవు పెట్టావు చూసావా.. పాపం ఆ మామయ్యగారు నిన్ను కలుద్దామని నిన్న ఆఫీసుకి వచ్చారులే!''

## సాధనములు

టీచరు: మనిషి 'పైకి' రావటానికి మూడు ఆధునిక సాధనములు ఏవి? ఎందుచేత?


విద్యార్థి: బిల్డింగుపైకి చేరటానికి లిఫ్టు, ఎయిర్ పోర్టు పైకి పోవటానికి ఎస్కలేటరు, పక్కమీంచి పైకి లేవటానికి అలారం క్లాక్.

## పొగడ్త

ఒక రాజకీయ నాయకుడ్ని కారులో కూర్చోపెట్టి- ఆ కారుని క్రేన్‌తో పైకెత్తేసారు అతని అభిమానులు.

''ఎందుకిలా చేసార''ని ఎవరో తెల్లబోతూ అడిగితే వాళ్ళు దానికిచ్చిన జవాబు- ''ఆయన్ని పొగడ్తలతో ఆకాశానికెత్తేసేయాలని మా పెసిరెంటుగారు చెప్పారండి. అందుకని?''

**- తటవర్తి రామచంద్రరావు** (న్యూఢిల్లీ)




నాన్న రుణం ఏమిచ్చి తీర్చగలను?

''అనంతయ్యగారూ! మీ కుటుంబం ఎంత దర్జాగా బ్రతికిందో, ఎందరికెన్ని విధాలా సాయపడిందో నాకేకాదు, వూళ్ళో వున్న వారందరికీ తెలుసు. మా తాతగారు, మీ తాతగారు మంచి మిత్రులనే విషయం మనకు తెలియందికాదు. మీ నాన్నగారికి, మా నాన్నగారికి ధన సంబంధమైన లావాదేవీలుండేవి. దాన ధర్మాలతో యిల్లు గుల్ల చేశారు. అప్పులు తీర్చడానికి మీ పొలమంతా మాకే అమ్మేశారు. ఇక మా విషయానికి వస్తే నా పెద్దకొడుకు అమెరికాలో యింజనీరుగా వుంటున్నాడు. వద్దు వద్దంటున్నా ప్రతినెలా డబ్బులు పంపుతూనే వున్నాడు. ఇక చిన్నబ్బాయికి పెళ్ళయింది. ఫ్యాక్టరీ వ్యవహారాలు సజావుగా నిర్వర్తిస్తున్నాడు. అందులో కూడా బాగా లాభాలొస్తున్నాయి. ఇక నా హయాంలో సంపాదించిందీ దండిగా వుంది. చిన్న కోడలు యింటి విషయాలన్నీ పర్యవేక్షిస్తుంది. అత్తమామలను స్వంత బిడ్డల్లా కాపాడుకొస్తున్నది. నాకొకటే లోటు- సుష్మను గారాబంగా, అపురూపంగా పెంచాను. ఆమెకు పెళ్ళి చేసేస్తే ఆపై శేషజీవితం కృష్ణా, రామా అంటూ నిశ్చింతగా గడిపేయవచ్చు. సుష్మ నన్ను ఒకే ఒక కోరిక, అదీ సబబైన కోరిక కోరింది. మీ అబ్బాయి రాజేంద్రను అక్కడెక్కడో చూచిందట. మొదటి చూపులోనే ప్రేమలో పడింది. ఈ విషయం నాతో చెప్పింది. చేసుకొంటే రాజేంద్రనే చేసుకొంటానంటున్నది. మీ సంబంధం కలుపుకోవాలని నాకూ వుంది. మీరు 'వూ' అంటే చాలు మీ పొలం మీ పేరిట వ్రాసేస్తాను. అమ్మాయినిచ్చి రంగ రంగ వైభవంగా పెళ్ళి చేస్తాను. మీరు కోరినంత కట్నమిస్తాను. ఇదంతా కాక అమ్మాయిపేరిట ఒక మేడ వుంది. అది మీ అబ్బాయి క్లినిక్ తెరవడానికి అనుకూలంగా వుంటుంది. అమ్మాయి పేరిట యింకా కొన్ని భూములున్నాయి. అవన్నీ మీకే. సుష్మను గురించి మీకు తెలియందేంలేదు. మీ గురించి, మీ కుటుంబ పరువు, ప్రతిష్టల గురించి క్రొత్తగా ఎవరూ చెప్పాల్సిన పనిలేదు. మీ కుటుంబంలో సుష్మ చక్కగా ఇమిడిపోతుంది. కన్నబిడ్డ కనుల ముందరే వుందన్న తృప్తి నాకు మిగులుతుంది. మాకు మంచి సంబంధాలు రాకకాదు. మేము ముందుగా అడిగామని చులకన వద్దు. మీ యింటిలో సభ్యులందరూ ఈ సంబంధం ఇష్టపడతారనే నేనను కొంటున్నాను. మరో మాట- ఈ సంగతి బయటిక్కడా పొక్క నీయకండి. అడిగి లేదనిపించుకోవడం మాకూ నామోషీగా వుంటుంది. ఏ సంగతీ ఆలోచించుకొని వారంలోగా స్వయంగా మీరే వచ్చి చెబితే సంతోషిస్తాను. మీకిష్టమైతే నిశ్చితార్థం పెట్టుకొందాం. ఈరోజు ఆదివారం. రేపు రండి, మీకెంతకావాలో తీసుకెళ్ళండి. ప్రస్తుతం యింటిలో అంత నగదులేదు. నా అభ్యర్థన మన్నిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు.

దశరథరామయ్యగారి కుటుంబ సభ్యులందరూ గేటువరకు వచ్చి వీడ్కోలు పలికారు.

మా యింటిలోని వారందరికి దశరథరామయ్యగారి ప్రపోజలు ఆనందం కలిగించింది. మా అమ్మ సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. నాకు ఇష్టమా? కాదా? అని నన్నెవరూ అడుగలేదు. అదే నన్ను బాధించిన విషయం. ఇంటికి తానైవస్తానన్న లక్ష్మీదేవిని ఎవరైనా వద్దంటారా? నేను ఒప్పుకోవాలే గానీ వెంటనే మా యింటి దరిద్రమంతా పారిపోవడం ఖాయం.

సుష్మ విషయంలో నేను ముభావంగా వున్నట్లు అమ్మ ఎలా కనిపెట్టిందో ఏమో నాకు తెలియదు. ఏకాంతంలో ''నీకీ సంబంధం ఇష్టంలేదా?'' అని అడిగింది. బిడ్డ అవసరాలు తల్లికి తెలిసినంతగా మరెవరికి తెలుస్తుంది? బదులేం చెప్పాలో తోచక మిన్నకుండిపోయాను.

''నాయనా, రాజేంద్రా! సుష్మను పెళ్ళాడ్డం నీకిష్టం లేదా? అసలు పెళ్ళంటేనే ఇష్టంలేదా? మరెవరినైనా ఇష్టపడ్డావా? లేక మీ నాన్నగారేమైనా అన్నారా?''

''అలాంటిదేమీలేదమ్మా?'' అన్నాను.

''నన్నూ కాస్త ఆలోచించనీ'' అన్నాను.

''పెళ్ళంటే నూరేళ్ళ పంటకదా!'' అన్నాను. అమ్మ ఎంతకూ నా మాటలు నమ్మడంలేదు.

''బాబూ! నీ మనసులో ఏముందో చెప్పు. కన్నతల్లిని- నా వద్ద దాపరికమేమిట్రా'' అంది.

మౌనమే నా సమాధానమైంది.

''నాయనా! తల్లిని మించిన దైవం లేదంటారే. బిడ్డకు అమ్మా నాన్నల మించిన శ్రేయోభిలాషులుంటారా? నీవు బదులు చెప్పకపోయావో, అన్నం కూడా ముట్టను.''

అమ్మ నాపై ఏకంగా బ్రహ్మాస్త్రమే సంధించింది. పిచ్చుకను నేనెంత? ఇక తప్పదని జరిగిందంతా అమ్మతో చెప్పేశాను. టూకీగా సంగతి ఇది.

రాధ రెండవ సంవత్సరం మెడిసిను చదువుతున్నది. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకొంది. ప్రభుత్వం రాధ తల్లికి అటెండరుద్యోగం ఇచ్చింది. ఉన్నంతలో ఆమె రాధను అపురూపంగా పెంచింది. రాధ తెలివైంది. ఇంటరులో ప్రథమశ్రేణిలో వుత్తీర్ణురాలైంది. పెద్దలు చదువాపి పెళ్ళి చేయాలనుకొన్నారుగానీ, కుదరక మెడిసినులో చేర్పించారు. రాధతో తను పరిచయం పెంచుకొన్నాడు. పరిచయం ప్రేమగా మారింది. రాధతో తన ప్రేమ విషయం వెల్లడించాడు.

''చూడు, రాజేంద్రా! ప్రేమ నిజాయితీ కోరుతుందంటారు. ప్రేమలో అరమరికలుండకూడదంటారు. నాకు చిన్నతనం నుండి బావంటే మక్కువ. యవ్వనం వచ్చేసరికి బావపై నాకున్నది మక్కువకాదు, ప్రేమేనని తెలుసుకొన్నాను. నా ప్రేమ విషయం నాలోనే దాచుకొన్నాను. సమయం వచ్చినపుడు పెద్దలతో చెప్పాలనుకొ

న్నాను. ఇంటరు పాసైనప్పుడు మా అమ్మ నా పెళ్ళి విషయం ప్రస్తావించింది. బావను చేసుకొంటానన్నాను. మాతరపున రాయబారం వెళ్ళింది. మా బావ ఆర్. అండ్ బి.లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. పది లక్షల కట్నమిస్తామని ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. కానీ మీరింతగా అడుగుతున్నారు కాబట్టి అందులో సగమైనా ఇవ్వమన్నారు. అంతకు తగ్గే ప్రసక్తే లేదన్నారు. అంత కట్నం మేమెక్కడ నుండి తేగలం? ఇలా పెళ్ళి విషయం మూలన పడింది. విధిలేక మెడిసినులో చేరాను. ఇప్పుడు చెప్పు- కట్నం లేకుండా నన్ను పెళ్ళాడగలవా? మీ పెద్దలిందుకు సమ్మతిస్తారా?'' ఇలా దాపరికం లేకుండా రాధ తన మనసులోని మాటను చెప్పింది.

''ఆమె ప్రేమలో నిజాయితీ నాకు నచ్చింది. నా మెడిసిను పూర్తికాగానే, పెద్దల సమ్మతితో పెళ్ళాడాలని మేమిద్దరం తీర్మానించుకొన్నాము. తల్లిని మించిన దైవం లేదంటారు. అమ్మా! యిప్పుడు చెప్పు! నా సమస్యకు పరిష్కారమేమిటి? నేనిప్పుడు రాధను పెళ్ళాడాలా? సుష్మను పెళ్ళాడాలా?'' అని అమ్మనడిగాను.

సుందరమ్మగారు కాసేపు ఆలోచించారు.

''రాజేంద్రా! ఆడదాని మనసు ఆడదానికే తెలుస్తుందంటారు. రాధ ఒకప్పుడు వాళ్ళ బావను ప్రేమించింది. ఇప్పుడు నిన్ను ప్రేమిస్తున్నది. రేపు మరొకరిని ప్రేమించదని గ్యారంటీ ఏమిటి? ప్రేమ అంత చంచలమైనదా? రాధకు నీపట్ల అంకితభావమైన ప్రేమ లేదని నేననుకొంటున్నాను. అదీగాక ప్రేమించాను, పెళ్ళాడమని ఎవరైనా అడిగితే ఆ స్త్రీ ఏం జవాబు చెప్పాలి? ప్రేమించాననో, ప్రేమించలేదనో ఏదొక జవాబు చెప్పాలి. కానీ రాధ నీతో తన గతం గురించి చెప్పాల్సిన అవసరమేమిటి? తన బావతో పెళ్ళి కుదరనందుకు, నీతో పెళ్ళికి సమ్మతించింది. నీతో పెళ్ళి కుదరకపోతే మరొకరిని పెళ్ళాడుతుంది. నిజంగా ఆమె తన బావను ప్రేమించినట్లైతే తన బావకోసం ఏం చేసింది? నిజమైన ప్రేమ అయితే తన బావను మరచి అంత సులభంగా నీతో పెళ్ళికి ఒప్పుకొనేదా? అదలా వుండనీ. నీ ప్రస్తుత సమస్య మెడిసిను పూర్తి చేయడం. దశరథరామయ్యగారు నిన్నాదుకోకుంటే మీ నాన్నాయిక చదివించలేరన్నది వాస్తవం. చదువాపితే రాధ నిన్ను పెళ్ళాడుతుందా? పెళ్ళాడినా మీ జీవితాలు సజావుగా సాగుతాయా? నన్నడిగితే ఈ పెళ్ళి మంచిది కాదని అంటాను. వద్దురా కన్నా! ఈ టైంపాస్ ప్రేమలు నీకొద్దు.

ఇక సుష్మ సంగతి. కలిగినింటి ఆడపడుచు. నీతో ఎన్నడూ మాట్లాడి ఎరుగదు. అయినా తొలిచూపులోనే నిన్ను ప్రేమించిందని నేననుకొంటున్నాను. తన ప్రేమ సంగతి తన తండ్రితోనే చెప్పగలిగిందంటే, ఇదీ నిజమైన ప్రేమని నాకు నమ్మకం. పోనీ యిది చెప్పు- సుష్మ నిన్నెందుకు ప్రేమించింది? ఆస్తిలో అధికుడవనా? అంతస్తులో అధికుడవనా? నీకంటె గొప్ప సంబంధం రాదనా? నిజమైన ప్రేమ హెచ్చు తగ్గులెరుగదు. సుష్మను నేను ఆమె చిన్నతనం నుండి చూస్తున్నాను. చాలా మంచి అమ్మాయి. నీకు సరిజోడి. ఆమె మన యింటి కోడలైతే ఎంతో సంతోషిస్తాను. నీవు ప్రేమించిన అమ్మాయికన్నా, నిన్ను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళాడు, జీవితం నందనవనమౌతుంది. జీవితమంతా తన ప్రేమను మన్నించావన్న కృతజ్ఞతతో మెలుగుతుంది. నిన్ను దైవంలా ఆరాధిస్తుంది. మీనాన్న మీకోసం బంగారం పండే భూములన్నీ అమ్మేశారు. పూలమ్మిన చోట కట్టెలమ్మలేంకదా! జీవితంలో అదృష్టమొకసారే తలుపు తడుతుంది. సద్వినియోగం చేసుకో. నీ సమస్యకు నేను చూపే పరిష్కారమిదే. నీకు నచ్చిందా, సంతోషమే. సుష్మకన్నా రాధే నీకు తగినదనుకొన్నా నాకభ్యంతరం లేదు. నిండుమనసుతో మేమాశీర్వదిస్తాము. మేం కోరేదీ నీ సుఖమే'' నన్నది అమ్మ.


అమ్మ చూపిన పరిష్కారం మార్గం నాకెంతో నచ్చింది. సుష్మను చేసుకొన్నా, రాధను చేసుకొన్నా నాకే సమస్యాలేదు. తల్లిదండ్రులు అడ్డుకారు, అనేదే నా మనసుకు వూరట. రాధకన్నా సుష్మ అందమైనదీ, ఐశ్వర్యవంతురాలనే స్వార్థంతో మా అమ్మ సుష్మపట్ల మొగ్గు చూపుతున్నదా? అనే అనుమానం నాలో మొలకెత్తింది. ఛ ఛ! అమ్మ మనస్తత్వం అలాంటిది కాదు. రాధనే పెళ్ళాడాలని తీర్మానం చేసుకొన్నాను. దశరథ రామయ్యగారిని కలవడానికి మనసొప్పలేదు. అమ్మ దాచివుంచుకొన్న ఐదువేలతో పట్నం చేరాను.

కాలేజీకి వెళ్ళగానే కోదండపాణి ప్రొఫెసరుగారు పెళ్ళాడారనే వార్త విన్నాను. ఆయనకు నలభై ఏళ్ళుంటాయి. స్వతహాగా స్థితిమంతుడు. మొదటి కళత్రం ప్రసవ సమయంలో మరణించి ఐదేళ్ళయింది. ఇది ద్వితీయ వివాహం. ఇంతకూ ఆయన పెళ్ళాడింది ఎవరినో కాదు, రాధను అనే మాట- విని మ్రాన్పడిపోయాను. అప్పుడు అమ్మ చెప్పిన మాటలు మదిలో మెదిలాయి- 'రాధ ఒకప్పుడు వాళ్ళ బావను ప్రేమించింది. ఇప్పుడు నిన్ను ప్రేమిస్తున్నది. రేపు మరొకరిని ప్రేమించదని గ్యారంటీ ఏమిటి? వద్దురాకన్నా ఈ టైంపాస్ ప్రేమలు నీకొద్దు.'

అయినా నాలాంటి బికారిని చేసుకొని రాధ ఏం బాగుపడుతుంది. రాధ భావి జీవితం బాగుండాలని ఆ దేవుని మనసారా వేడుకొన్నాను. ప్రేమించిన వ్యక్తి బాగుండాలని కోరుకొనేదే నిజమైన ప్రేమ అనుకొంటే నాదీ నిజమైన ప్రేమే. రాధ తన మార్గం తను చూసుకొంది. ఇక నా మార్గం నేను చూచుకొంటే తప్పేమిటి? అమ్మ చూపిన పరిష్కారమే, భగవంతుడూ చూపాడు.

మరుసటిరోజే దశరథరామయ్యగారిని కలిసి లక్ష రూపాయలు తెచ్చుకోవాలని నిర్ణయించుకొన్నాను. ★

## అమెరికాలో మనవాళ్లు



అమెరికాలో మన భారతీయులు హెచ్చుసంఖ్యలో ఉన్నారని మనకు తెలుసు. అయితే ఆ సంఖ్య ఎంతో తెలియదుగదూ? చిత్తగించండి! 3.22 మిలియన్ల భారతీయులు ఆ దేశంలో వున్నారు. అమెరికాలోని డాక్టర్లలో 38 శాతం భారతీయులే! అక్కడి సైంటిస్టులలో 12 శాతం, మైక్రోసాఫ్ట్ ఉద్యోగస్థుల్లో 34 శాతం మంది, 'ఐబిఎమ్' ఉద్యోగస్థుల్లో 28 శాతం మంది భారతీయులే!

- కొడిమెల

## ది మౌస్ ట్రాప్

'అగాథాక్రిస్టీ' రచించిన 'ది మౌస్ ట్రాప్' అనే మర్డర్ మిస్టరీ నవలను అనుసరించి ప్రదర్శించిన 4000 నాటక ప్రదర్శనలలోనూ ఉపయోగింపబడిన 0.38 కాలిబర్ కోల్టు రివాల్వరు ఇటీవల 600 పౌండ్లకు వేలం వేయబడింది. పది మిలియను పౌండ్ల బాక్స్ ఆఫీసు ఆదాయాన్ని గడించుకున్న 'ది మౌస్‌ట్రాప్' నాటకాన్ని సుమారు ఆరు మిలియనుమంది ప్రేక్షకులు చూసి ఆనందించారు. ప్రపంచంలో చాలా ఎక్కువ రోజులు ఆడిన నాటకం ఇదే!

## పిల్లుల మార్గజ్ఞానం

పిల్లులకు అమోఘమైన 'మార్గజ్ఞానం' వుంది. ఐర్లాండ్‌లో ఒక అపురూపమైన ప్రయోగం చేసి ఈ విషయాన్ని నిరూపించారు. 'రాబ్‌కెల్లండర్'ని, అతడి పెంపుడు పిల్లి 'పాట్రిక్'ను తీసుకెళ్ళి ఎక్కడో 200 కిలోమీటర్ల దూరంలో వదిలిపెట్టారు. అహోరాత్రులు చాకచక్యంగా ప్రయాణించి ఆ పిల్లి తన యజమానిని త్రోవ తప్పకుండా తిరిగి ఇంటిపట్టుకి చేర్చింది.

- స్వాతి

